# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ గండికోట ప్రాంతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా జరుగుతోందని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు.
- ❖ రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
- ❖ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో రానున్న 2 రోజుల్లో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==============================

స్టీల్‌ప్లాంట్ నిర్మాణంతో జమ్మలమడుగు ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కడప జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఈరోజు జమ్మలమడుగు నియోజకవర్గంలో జరిగిన ప్రజావేదిక బహిరంగ సభలో మాట్లాడుతూ... 2028 సంవత్సరాంతానికి స్టీల్‌ప్లాంట్ పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. అమెరికాకు గ్రాండ్ క్యానియన్ ఉన్నట్టుగా రాష్ట్రానికి గండికోట ఉందని, ఆ ప్రాంతాన్ని ఆకర్షణీయంగా తయారు చేస్తామని చెప్పారు. అక్కడ 85 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభిస్తామని, అలాగే శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటు చేస్తామని అన్నారు. హంద్రీనీవా లైనింగ్ పనులు, చెరువుల మరమ్మతులు చేపట్టామన్న ఆయన.. దేశంలోనే అధిక మొత్తంలో పింఛన్లు ఇచ్చే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలియజేశారు.

(వాయిస్ 38 సెకన్లు)

==============================

రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా జరుగుతోందని శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. ఈరోజు ఆయన అనకాపల్లి జిల్లా, నాతవరం మండలం, గునుపూడి గ్రామంలో జరిగిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, పలువురు లబ్దిదారులకు పింఛన్లు అందజేశారు. అనంతరం జరిగిన సభలో సభాపతి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 14 వేల పంచాయతీల్లో పింఛన్లు పంపిణీ జరుగుతున్నాయని అన్నారు. ఈ నెలలో మొత్తం 64 లక్షల మందికి పింఛన్లు అందజేస్తున్నామని, దీనికి గాను ప్రభుత్వం 2 వేల 750 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు.

==============================

ఎన్టీఆర్ మానససరోవర్ ప్రాజెక్ట్ తో గుంటూరు ప్రాంత పర్యాటక అభివృద్ధి జరగాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆకాంక్షించారు. ఈరోజు ఆయన.. స్థానిక శాసన సభ్యులు మహమ్మద్ నసీర్ ఎహ్మద్‌తో కలిసి గుంటూరు శివారులోని ఎన్టీఆర్ మానసరోవర్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అభివృద్ధి లక్ష్యాల ఫలితంగా గుంటూరులో పలు చారిత్రక ప్రాజెక్టులు తెరమీదికి వస్తున్నాయన్నారు. ఈ పార్కుకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు చర్యలు ప్రారంభించామని తెలిపారు. సుమారు 50 ఎకరాల్లో విస్తరించి ఉన్న చెరువును ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (PPP) విధానం ద్వారా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలియజేస్తూ....

(వాయిస్ 26 సెకన్లు)

==============================

రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈరోజు ఆయన చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, అనంతరం ఆర్ అండ్ బి అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... చిత్తూరు, మదనపల్లి, పలమనేరు డివిజన్ పరిధిలో మంజూరైన రహదారి అభివృద్ధి పనులకు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి, 6 నెలల లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల మధ్య ఉన్న రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక శాసన సభ్యులు ఎన్. అమర్ నాథ్‌రెడ్డి మంత్రిని కోరగా.. ఈ అంశాన్ని కేంద్రమంత్రి నితిన్ గడ్కరి దృష్టికి తీసుకెళ్లి ఇంటర్ స్టేట్ ఫండ్స్ మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

విరామం

==============================

ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఏడేళ్ల తర్వాత రాష్ట్రానికి తిరిగి రావడం సంతోషదాయకమని శాప్ ఛైర్మన్ ఏ. రవినాయుడు అన్నారు. ఈరోజు ఆయన విజయవాడలో మాట్లాడుతూ... విశాఖపట్నం వేదికగా పీకేఎల్ 12వ సీజన్‌లో తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్ జట్ల మధ్య తొలి మ్యాచ్ ఈ నెల 29వ తేదీన ప్రారంభమవుతుందన్నారు. 12వ సీజన్ సరికొత్త అధ్యాయంగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ స్పోర్ట్స్ అథారిటీ వ్యవహరిస్తాయని, ప్రో కబడ్డీ లీగ్ నిర్వాహకులకు, అసోసియేట్ పార్టనర్స్, స్పాన్సర్లకు అన్ని విధాలా సహకారం అందిస్తామని రవినాయుడు తెలియజేశారు.

==============================

దేవాలయాల్లో పరిశుభ్రతను కాపాడేందుకు విశాఖకు చెందిన రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ (RCVC) సభ్యులు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. స్వచ్ఛ దేవాలయం పేరిట.. దేవాలయాల్లో వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయడంతో పాటు ఆ వ్యర్థాలను విలువైన వనరుగా మార్చేందుకు శ్రీకారం చుట్టారు. ప్రతి రోజు దేవాలయానికి భక్తులు సమర్పించే పువ్వులు, పండ్లు, ఇతర నైవేధ్యాల నుండి ఏర్పడిన వ్యర్థాలను సేకరించి, వాటితో సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నారు. కంపోస్ట్ ఎరువులతో దేవాలయంలో మొక్కలు పెంచడంతో పాటు, ప్రజలకు.. వారి ఇంటి మొక్కల అవసరాలను తీర్చడానికి అందజేస్తున్నామని RCVC కార్యదర్శి శ్రావణి చిట్టూరి వివరిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

==============================

సింగపూర్ పర్యటనలో ఉన్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ ఈరోజు ALBA వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ను సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుతో కలిసి పరిశీలించారు. వ్యర్ధాల సేకరణ నుంచి వాటిని రీసైక్లింగ్ చేసే వరకూ ఎలాంటి పద్దతులు అవలంబిస్తున్నారనేది సింగపూర్ అధికారులు మంత్రికి వివరించారు. సింగపూర్ లో అనుసరిస్తున్న విధానాలను రాష్ట్రంలో కొన్ని చోట్ల అమలు చేస్తే ఎలా ఉంటుందనే దానిపై అక్కడి అధికారులతో మంత్రి చర్చించారు. కాగా మంత్రి ఈ మధ్యాహ్నం సింగపూర్ పోలీస్ ఫోర్స్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా నిర్మించేందుకు అవసరమైన పద్దతులను అధ్యయనం చేసేందుకు మంత్రి నారాయణ గత 6 రోజులుగా సింగపూర్ లో పర్యటిస్తున్నారు.

==============================

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత సచివాలయంగా రాష్ట్ర సచివాలయాన్ని ఈ నెల 15వ తేదీ నాటికి తీర్చిదిద్దాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడం అంశంపై ఈరోజు నిర్వహించిన అవగాహన, శిక్షణా సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడటమే కాక మైక్రో ప్లాస్టిక్ కారకాల వల్ల మానవాళి, పశుపక్ష్యాదుల ఆరోగ్యానికి హాని కలుగుతుందన్నారు.

==============================

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న ఐదవ టెస్ట్ మ్యాచ్ లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 204 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో ఈరోజు ఆట ప్రారంభించిన భారత్ స్వల్ప వ్యవధిలోని చివరి నాలుగు వికెట్లను కోల్పోయింది. దీంతో తొలి ఇన్సింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్ భోజన విరామ సమయానికి ఒక వికెట్ నష్టపోయి 109 పరుగులు చేసింది. ఇంకా 115 పరుగుల వెనుకంజలో ఉంది.

==============================

రాష్ట్రంలోని దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. వీటి ఫలితంగా రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో రానున్న 2 రోజుల వరకు తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు లేదా జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు.

==============================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాలతో ముగించాయి. సెన్సెక్స్ 81 వేల 185 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరికి 586 పాయింట్ల నష్టంతో 80 వేల 599 వద్ద స్థిరపడింది.

==============================
==============================